## రంజాన్ కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న అంజాదుల్లా ఖాన్

**చార్మినార్:** రంజాన్ మాసంలో జకాత్ పేరుతో పేద ప్రజలను ఆదుకోవడం చక్కటి దైవ కార్యమని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజాదుల్లా ఖాన్ అన్నారు. యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గంలోని 2 వేల మంది నిరుపేదలకు ఆయన మంగళవారం రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పేదల సమస్యలను తెలుసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రంజాన్ మాసం ప్రారంభమైనప్పటి నుంచి నియోజకవర్గంలోని పేద ప్రజలకు నిత్యావర వస్తువుల పంపిణీ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బజార్ డివిజన్ ఎంబీటీ నాయకులు అబ్దుల్ రెహమాన్, ముతాహర్ మెహదీ ఖాన్, అఫ్సాన్ ఉల్లా ఖాన్, సయ్యద్ హాజీ, మహ్మద్ షోయెబ్ పాల్గొన్నారు.

## నేటి తరానికి నాటకరంగం ప్రాముఖ్యతను తెలియజేయాలి



**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు రవీంద్రభారతిలో రసరంజని నాటకోత్సవాలను నిర్వహించనున్నారు. మొదటిరోజు అయిన మంగళవారం అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై నాటకోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి తరానికి నాటకరంగం ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం రంగస్థల దర్శకుడు కె.సుబ్బరాజు దర్శకత్వంలో నర్తనశాల నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నాటక సమాజాల సమైఖ్య కార్యదర్శి ఎస్.శ్యామ్‌ప్రసాద్, రసరంజని కార్యవర్గ సభ్యుడు పాల్గొన్నారు.

## సత్కారం



అఘోరిని సత్కరిస్తున్న పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్ లోధ్ తదితరులు

**అబిడ్స్:** ధూల్‌పేట్ ప్రాంతానికి వచ్చిన అఘోరి మణికందన్‌ను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. అఘోరిని సత్కరించిన వారిలో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పప్పు మాత్రే ఆనంద్‌సింగ్, ఇతర నేతలు బల్‌రామ్ యాదవ్, ధినేష్ సింగ్, అజయ్ యాదవ్, భరత్, ప్రశాంత్ సింగ్, రోహన్ సింగ్ ఉన్నారు.

## వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



తాహ నజర్

**డబీర్‌పురా:** అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ డబీర్‌పురా ఫ్లై ఓవర్ పై నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం రాత్రి డబీర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆమెను స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట్ కాలాడేరా ప్రాంతానికి చెందిన తహ నజర్(25)కు డబీర్‌పురా ప్రాంతానికి చెందిన మీర్జా మోజం అలీ అలియాస్ ఆమీర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు సంతానం. చాలా కాలంగా అత్తింటి వారు భర్తకు వాహనం కొనిపెట్టాలని ఆమెను వేధింపులకు గురిచేశారు. మృతురాలి తండ్రి మరణించగా..తల్లి మాత్రమే ఉంది. అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఆలయాలకు నోటీసులు ఇవ్వడం తగదు: బీజేపీ

**రాయదుర్గం:** నానక్‌రాంగూడలోని కాళికా మాత ఆలయానికి హైడ్రా అధికారులు ఇచ్చిన నోటీసును వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. నానక్‌రాంగూడలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన కాళీకామాత ఆలయానికి హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆలయాన్ని పరిశీలించి అర్చకులు, నిర్వాహకులలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల భూములపై పడడం తగదన్నారు. బీజేపీ అధిష్టానంతో చర్చించి పెద్ద ఎత్తున ఆలయ పరిరక్షణకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దర్శన్‌సింగ్, కై లాస్‌సింగ్, శివసింగ్, కన్నయ్యలాల్, బీజేపీ నాయకులు రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, తిరుపతి, వరలక్ష్మీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# దొంగలున్నారు జాగ్రత్త!

- రంజాన్ చివరి రోజులు ఎంతో కీలకం..పెరిగిన రద్దీ
- రంజాన్ మార్కెట్‌లో పోలీసుల నిఘా ముమ్మరం
- మైకుల ద్వారా పిక్ ప్యాకెటర్స్ ఉన్నారంటూ హెచ్చరికలు
- ఇప్పటికే డజనుకు పైగా సెల్‌ఫోన్లు, హ్యాండ్ బ్యాగ్‌ల చోరీ
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



గుల్జార్‌హౌజ్–చార్మినార్ రోడ్డులో రంజాన్ మార్కెట్

**చార్మినార్:** రంజాన్ పండుగకు అవసరమైన వస్తువులను ఖరీదు చేయడంలో ముస్లింలు నిమగ్నమయ్యారు. దీనికి తోడు పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వస్తున్న సందర్శకుల సందడితో చార్మినార్ పరిసరాల్లో జనం రద్దీ ఎక్కువయ్యింది. ఈద్–ఉల్–ఫితర్ పండుగకు తప్పనిసరిగా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించడం ఆనవాయితీగా వస్తుండడంతో వాటిని ఖరీదు చేయడానికి అధిక సంఖ్యలో దుస్తుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. పటేల్ మార్కెట్, మదీనా, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టీ, రికాబ్‌గంజ్, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాలలోని వస్త్ర వ్యాపార కేంద్రాలు రద్దీగా మారాయి. పెరిగిన రద్దీతో దొంగలు తమ చేతి వాటం చూపిస్తున్నారు. షాపింగ్ చేసే వారు తమ వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. ఏమాత్రం ఏమరుపాటుతో ఉన్నా..సెల్‌ఫోన్లు, హ్యాండ్ బ్యాగ్‌లు చోరీలకు గురవుతున్నాయి.

### జేబు దొంగల చేతివాటం...

ఓవైపు రంజాన్ మార్కెట్ సందర్భంగా చార్మినార్–మక్కా మసీదు ప్రధాన రోడ్డులో జనం రద్దీ ఎక్కువగా ఉండడంతో మరోవైపు జేబు దొంగలు తమ చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. రెప్ప పాటులో సెల్ ఫోన్లను, హ్యాండ్ బ్యాగ్‌లను తస్కరించి పారిపోతున్నారు. కాలు తీసి కాలు పెట్టలే నంతగా జనం ఉండడంతో ఎవరు ఏం చేస్తున్నారనే విషయం తెలియడం లేదు. దీంతో జేబు దొంగలు తమ పని తాము సులువుగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోతున్నారు. తమ సెల్‌ఫోన్లు దొంగిలించపడ్డాయని పేర్కొంటూ పలువురు చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేబు దొంగలను పట్టుకునే పనిలో సంబంధిత పోలీసులున్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జేబు దొంగల కోసం వెదుకుతున్నారు. రంజాన్ మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 15కు పైగా సెల్‌ఫోన్ దొంగతనాలతో పాటు ఏడెనిమిది హ్యాండ్ బ్యాగ్‌ల దొంగతనాలు జరిగినట్లు చార్మినార్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి.



సెల్ ఫోన్ పోయిందని చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

### మైకుల్లో పోలీసుల హెచ్చరికలు..

రంజాన్ మార్కెట్ సందర్భంగా తమ తమ వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని కోరుతూ చార్మినార్ పరిసరాల్లో చార్మినార్ పోలీసులు మైకులను ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. తెలుగు, ఉర్దూ, హిందీ బాషల్లో దొంగల గురించి వివరిస్తూ సూచనలు చేస్తున్నారు.

## న్యాయవాదులకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

**సిటీ కోర్టులు:** ఎంఎన్‌జే కేన్సర్ దవాఖానా ఆధ్వర్యంలో న్యాయవాదులకు కేన్సర్ అవగాహన కల్పించారు. మంగళవారం నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్‌లో ఎంఎన్‌జే హాస్పిటల్ సహకారంతో న్యాయవాదులకు కేన్సర్‌పై అవగాహన కల్పించడంతోపాటు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని నాంపల్లిలోని మెట్రోపొలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి బి.సురేశ్ ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ సహకారంతో ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్ సిబ్బంది న్యాయవాదులకు ఉచితంగా కేన్సర్‌పై అవగాహన కల్పించడమే కాకుండా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముమ్ముందు ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ న్యాయవాదులకు అండగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రటరి సీవీ శ్రీనాథ్, వైస్ ప్రెసిడెంట్లు గోకుల్, రామంజనేయులు, జాయింట్ సెక్రటరి మామిడాల రమేశ్, కమిటీ సభ్యులు రాజాగోపాల్, దయాకర్, ఈశ్వర్, కవిత, కిరణ్, కుమార్, శివకుమార్, మాధవి పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి సురేశ్

## రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న సివిల్ సప్లాయి ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ ఇమ్రోజ్, లోకేశ్‌రెడ్డి

**గౌలిపురా:** గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనను పౌర సరఫరాల శాఖ సర్కిల్–2 అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా బస్తీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఈ–సేవాల ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రజల దరఖాస్తులను సివిల్ సప్లాయి ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ ఇమ్రోజ్, లోకేశ్ రెడ్డి పరిశీలించారు. అర్హులైన ప్రజలందరూ ఈ–సేవా ద్వారా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను ఎప్పకటిప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ఇంటి వద్దకు వచ్చే అధికారులకు ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

## త్వరలోనే ఆరె కటికె సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తాం



నర్సింగ్‌రావ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాచిగూడ సంఘం నాయకులు

**సుల్తాన్‌బజార్:** త్వరలోనే కాచిగూడ ఆరె కటికె సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తామని తెలంగాణ ఆరె కటికె ట్రస్ట్ స్పష్టత ఇచ్చింది. మంగళవారం కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో కాచిగూడ ఆరెకటిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ ఆరె కటికె చైర్మన్ నర్సింగ్‌రావు, వైస్ చైర్మన్ నీతికార రవి, శ్రీనివాస్‌లు హాజరయ్యారు. వారికి కాచిగూడ ఆరె కటికె సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం నాయకులు సంజయ్‌రాజ్, పవన్‌రాజ్, ఉదయ్‌కుమార్, గోవింద్‌రాజ్‌లు, ట్రస్ట్ నాయకులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ..త్వరలోనే కాచిగూడ ఆరెకటికె సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. 33 ఏళ్లుగా ఈ సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. కాచిగూడ ఆరెకటిక సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

**యాకుత్‌పురా:** న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసాచారి, కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్ డిమాండ్ చేశారు. చంపాపేట్‌లో జరిగిన న్యాయవాది ఇజ్రాయిల్ దారుణ హత్యను నిరసిస్తూ పురానిహవేలీలోని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియెషన్ సభ్యులు, న్యాయవాదుల ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున్న నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ప్రభుత్వం దాడికి పాల్పాడిన నిందితుడిని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు తిరిగి జరగకుండా న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బర్కు రాజేష్ కుమార్, లైబ్రరియన్ సుధంష్ కుమార్, సీనియర్ న్యాయవాదులు ఎం ఎస్ తిరుమల్ రావు, శివకుమార్ దాస్, విద్యాసాగర్, అజమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సిటీ సివిల్ కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

## నేడు జాబ్ మేళా

**విజయనగర్‌కాలనీ:** రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జి.జయశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్ ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయస్సుగల వారు అర్హులు. వివిధ ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి నిర్వహించే ఈ జాబ్ మేళాలో నిరుద్యోగులు హాజరై తమ విద్యార్హతకు తగిన ఉద్యోగాన్ని ఎంచుకోవచ్చన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బుధవారం ఉదయం 10:30 గంటలకు ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలతో హస్తినాపురంలోని అనయ డిగ్రీ కాలేజీలో నేరుగా హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 80960 66166, 89771 75394లలో సంప్రదించవచ్చు.

## అన్నదానం



మదర్సాలో అన్నదానం చేస్తున్న దృశ్యం

**గోల్కొండ:** తమ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో మదస్సాలు, అనాథాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకులు, విశ్రాంత ఉద్యోగి సయ్యద్ హమేద్ ఆలీ ఖురేషి అన్నారు. మంగళవారం గోల్కొండ నయాకీలాలో ఆయన ఆధ్వర్యంలో మదర్సా విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మదర్సా విద్యార్థులు బాగా చదివేందుకు వారికి పౌష్టికాహారంతో పాటు పుస్తకాలు కూడా అందిస్తున్నామన్నారు. ప్రతి తరగతిలో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రతి యేటా నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్, ఫహాద్, మదస్సా ప్రతినిధి ఇమామ్ తదితరులున్నారు.

## రైలు కిందపడి యువకుడి మృతి

**నాంపల్లి:** రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 30 ఏళ్ల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని యువకుడు లింగంపల్లి–తెల్లాపూర్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై ఆకుపచ్చ రంగు చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

**యాకుత్‌పురా:** రంజాన్ నైట్ బజార్ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయిముద్దీన్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన స్టేషన్ పరిధిలోని దారుషిఫా, సాలార్‌జంగ్ మ్యూజియం, పురానిహవేలి, అలీజాకోట్లా, బీబీ బజార్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ మాసం నేపథ్యంలో సాయంత్రం నుంచి రాత్రి, తెల్లవారుజము వరకు జరిగే మార్కెట్‌కు సమస్యలు రాకుండా చూస్తున్నమన్నారు. స్టేషన్ పరిధిలోని నిత్యం రద్దీగా ఉండే చార్మినార్ రోడ్డు, బీబీ బజార్ చౌరస్తా, మొఘల్‌పురా వల్బా హోటల్, అలీజా కోట్లా, పంజేషా, చార్ కమన్, యాకుత్‌పురా, మీరాలంమండి, పురానిహవేలీ, దారుషిఫా, సాలార్‌జంగ్ మ్యూజియం ప్రాంతాల్లో 15 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



ట్రాఫిక్ నియంతిస్తున్న ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయిముద్దీన్, సిబ్బంది

## రాములోరి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలిరండి



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న రాహుల్‌దాస్ బాబా

**లంగర్‌హౌస్:** సంగం రాములోరి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలిరావాలని రాంచంద్రజీ మఠం పీఠాధిపతి 1008 మహంత్ రాహుల్ దాస్ బాబా అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన చారిత్రాత్మక మఠ ఆలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో ఉగాది నుంచి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్‌ను రాహుల్‌దాస్ బాబా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్య హోమాలు, కైంకర్య సేవలు నిర్వహించనున్నామన్నారు. ప్రతిరోజూ స్వామి వారిని వివిధ రకాల వాహనాలపై లంగర్‌హౌస్ పుర వీధుల్లో ఊరేగించనున్నామన్నారు. ఇందులో భాగంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుల కల్యాణాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేవకులు లింగారెడ్డి, అల్వాల రవీందర్ రెడ్డి, వినేష్‌సింగ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆశే శ్వాసగా' పుస్తకావిష్కరణ

**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ రచయిత్రి డాక్టర్ సమ్మెట విజయ రచించిన 'ఆశే శ్వాసగా' అనే పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..కేన్సర్ అనే వ్యాధి తీరును అందరికీ అర్థమయ్యేలా పుస్తకరూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. కేన్సర్ రహిత సమాజం కోసం మనవంతు కృషి చేయాలని సూచించారు. ఎంతో క్లిష్టమైన కేన్సర్ వచ్చినవారు కూడా సరైన వైద్యంతో బయటపడ్డారని గుర్తుచేశారు. కేన్సర్ వచ్చినవారికి ఈ పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎ.కిరణ్‌కుమార్, రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, అమృతలత, గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, కవయిత్రి నెల్లుట్ల రమాదేవి, సమ్మెట ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు రచయిత్రులు

## గుడిమల్కాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దేవర వంశీ

**గోల్కొండ:** ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ వేసవి కాలంలో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్మారక చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మంగళవారం ఆయన గుడిమల్కాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా సేవ చేస్తూ నిరుపేదలకు అండగా ఉన్న దేవర కరుణాకర్ సేవా కార్యక్రమాలను మునుముందు కూడా కొనసాగిస్తామన్నారు. ఈ చలివేంద్రాన్ని అశ్విన్‌మోదీ, విశాల్ సౌజన్యంతో ఏర్పాటు అయింది. ఈ కార్యక్రమంలో అశోక్‌యాదవ్, గంగాధర్, రాధాకృష్ణ, నామయాదగిరి, సుధాకర్‌యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిలబం క్రీడకు ప్రాచుర్యం కల్పించాలి



గెలుపొందిన క్రీడాకారులతో నాగేశ్వర్‌రావు

**గన్‌ఫౌండ్రీ:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని అఖిలభారత సాంప్రదాయ సిలబం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఏ.నాగేశ్వరరావు అన్నారు. సీబీఎస్‌సీ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ స్టేట్ సిలబం చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో సిలబం క్రీడకు ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ క్రీడలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి మోహన్, స్కూల్ ఎండీ ప్రీతి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

**గోల్కొండ:** పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం రిసాల బజార్‌లో బీజేపీ నాయకుడు బొమ్మల శ్రీకాంత్‌చారి రంజాన్ గెట్ టు గెదర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌చారి ఆయనను సన్మానించారు. పండుగలు, ఇఫ్తార్ విందులు, బోనాల వేడుకలు తదితర హిందూ ముస్లిం పండుగలు స్థానికుల మధ్య సత్‌సంబంధాలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జగదాంబిక మహంకాళి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారి, టీఎఫ్‌సీఓ కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్ తదితరులున్నారు.



మహ్మద్ నజీబ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## అభినందన భవానీ సేవలు వెలకట్టలేనివి



అభినందన భవానీని సత్కరిస్తున్న రోజారమణి

**గన్‌ఫౌండ్రీ:** సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవా రంగాల్లో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న అభినందన భవానీ సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు ప్రశంసించారు. మంగళవారం రవీంద్రభారతిలో సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సాంస్కృతిక సంఘ సేవకురాలు అభినందన భవానీ సాంస్కృతిక జీవిత మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటి మంజుభార్గవి మాట్లాడుతూ.. ఒక మహిళ 40 ఏళ్లుగా సాంస్కృతిక రంగంలో రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు గాయని గాయకుల సంగీత విభావరి, సంజయ్‌కిశోర్ నిర్వహించిన టాక్ షో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకురాలు సన్నపనేని రాజకుమారి, సినీనటి రోజారమణి, పద్మశ్రీ పురస్కార గ్రహీత శోభారాజు, దర్శకుడు రేలంగి నర్సింహారావు, వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు, సంగమం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజయ్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.